క్లుప్తంగా

తైక్వాండో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



తైక్వాండో పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక విన్ తైక్వాండో అకాడమీ విద్యార్థులు ఇటీవల కందుకూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ చాంపియన్ షిప్ పోటీల్లో ప్రతిభ కనపరిచారు. సత్యభామ, ఈశ్వరి, తేజ, శ్యామ్, మిథున్‌లు బంగారు పతకాలు సాధించగా, జితేంద్ర, నిహాల్, యోగి, మోక్షిత, అల్విూనాసహస్ర కాంస్య పతకాలు సాధించారు. బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు ఈ నెల 29 నుంచి హర్యానాలో జరుగనున్న జాతీయ స్థాయి సబ్ జూనియర్ తైక్వాండో పోటీల్లో పాల్గొననున్నారు. వీరిని కోచ్‌లు కమల్, రాజేష్, సంతోష్ తదితరులు అభినందించారు.

వార్డుల్లో పర్యటించిన కమిషనర్



వార్డులో పర్యటిస్తున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

ప్రొద్దుటూరు : పట్టణంలోని పలు వార్డుల్లో సోమవారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పర్యటించారు. శివాలయం సెంటర్ సమీపంలో ఉన్న చెత్తపాయింట్‌ను వెంటనే కార్మికులతో కమిషనర్ తొలగించారు. అర్చన హాల్ వద్ద పెద్ద కాలువలో చెత్తను తొలగించాలని శానిటేషన్ అధికారులకు, కోనేటి కాలువ వీధిలో కల్వర్టు వద్ద గ్రిల్ ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు కమిషనర్ ఆదేశించారు. కోనేటి కాలు వీధిలో కోదండ రామాలయం వద్ద చెత్తపాయింట్‌ను వెంటనే తొలగించాలని సిబ్బందికి కమిషనర్ తెలిపారు. వీధుల్లో ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలని పారిశుద్ధ్య ఇబ్బందికి సూచించారు.

అనాథలకు అండగా 'సేవాశ్రమం'




జ్యోతిక్షేత్రంలోని అనాథ వృద్ధురాలిని ఆశ్రమానికి తీసుకెళుతున్న రామకృష్ణారెడ్డి

కాశినాయన : మండలంలోని ఓబుళాపురం సగిలేరు ఒడ్డున ఉన్న వివేకానంద సేవాశ్రమం అనాథలకు అండగా నిలుస్తుందని సేవాశ్రమం నిర్వాహకులు రామకృష్ణారెడ్డి తెలిపారు. మండలంలోని జ్యోతిక్షేత్రంలో దీనస్థితిలో ఉన్న ఓ అనాథ వృద్ధురాలిని రామకృష్ణారెడ్డి చేరదీసి అన్ని సపర్యలు చేసి సేవాశ్రమానికి తీసుకెళ్లాడు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులు, నిరాశ్రయులు, వృద్ధులకు ఉచితంగానే ఆశ్రయం కల్పిస్తున్నామని, ఎక్కడైనా అనాథలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : నిరుద్యోగులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ అశోక్‌బాబు కోరారు. సోమవారం కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడ్యాప్, జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. జాబ్ మేళాలో షిర్డీసాయి ఎలక్ట్రికల్స్, అమర్‌రాజా, ఏఐఎల్ డిక్సన్, నవ భారత్ ఫెర్టిలైజర్స్, యంగ్ ఇండియా కంపెనీలు పాల్గొన్నాయి. మేళాలో 108 మంది అభ్యర్థులు పాల్గొనగా 66 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు.

నేలకొరిగిన వరి



గుంతపల్లెలో అకాల వర్షానికి నేలవాలిన వరిపంటను చూపుతున్న రైతు

బి.కోడూరు : అకాల వర్షాలకు మండలంలోని గుంతపల్లె, బి.కోడూరు, మేకవారిపల్లె, మరాటిపల్లె, పాపసపల్లె, పాయలకుంట్ల, ఐత్రంపేట, పెద్దుళ్లపల్లి, ప్రభలవీడు తదితర గ్రామాల్లో వరిపంట నేలవాలింది. వర్షానికి గింజలు మొసులొచ్చాయి. అంతేకాకుండా కోత కోసేందుకు కూడా వీలు లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు. ఈ ఏడాది పెరిగిన ధరలకు అనుగుణంగా వరిపంట సాగు మొదలు చేతికందే వరకు సుమారు ఒక ఎకరాకు రూ.35 వేలు నుంచి రూ.40 వేలు వరకు ఖర్చు చేశామని చెబుతున్నారు. ప్రస్తుతం ఎకరానికి 10 నుంచి 20 బస్తాల కంటే దిగుబడి రాదని వాపోతున్నారు. అధికారులు దెబ్బతిన్న వరిపంటను పరిశీలించి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరుతున్నారు.

అసలు కంటే... కొసరు ఎక్కువ..!

- పదవ తరగతి పరీక్షఫీజు పేరుతో ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలల దోపిడీ
- యాజమాన్యాల ఇష్టారాజ్యంతో తల్లిదండ్రులకు అవస్థలు
- పట్టించుకోని అధికారులు



ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఫీజులపేరుతో అధిక మొత్తాలను వసూలు చేసిన ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలలు 10వ తరగతి పరీక్ష ఫీజు పేరుతో కొత్త దోపిడీకి తెరతీశాయి. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి పబ్లిక్ పరీక్ష ఫీజును అడ్డగోలుగా వసూలు చేస్తున్న విద్యాశాఖ అధికారులు పట్టించుకోని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం వసూలు చేసే ఫీజుకు కొన్ని పాఠశాలలు నిర్వాహకులు వసూలు చేస్తున్న మొత్తానికి పొంతన లేకుండా పోయింది. మండలంలో 77 ప్రభుత్వ, మున్సిపల్, ఎయిడెడ్, ప్రైవేటు, కార్పొరేటు ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. 3,650 మంది విద్యార్థులు 10వ తరగతి వార్షిక పరీక్షలు రాయనున్నారు. 56 ప్రైవేటు, కార్పొరేటు హైస్కూల్‌లలో దాదాపు 2,150 మంది పరీక్షలు రాయనున్నారు. అయితే పరీక్షల నిర్వహణ కోసం నిర్దేశిత ఫీజు కంటే అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఫీజుకంటే పదింతల పైగా వసూలు చేస్తుండటం గమనార్హం.

ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక పరీక్ష ఫీజు వసూలు చేస్తున్న విద్యాశాఖ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. నిబంధనల ప్రకారం అన్ని సబ్జక్టులకు, మూడు సబ్జక్టులకు మించి రూ.125, మూడు సబ్జక్టులకు రూ.110, ఒకేషనల్ విద్యార్థులకు అదనంగా మరో రూ.60, నిర్ణీత వయసు కంటే తక్కువ ఉన్నవారు రూ.300, మైగ్రేషన్ సర్టిఫికేట్‌కు రూ.80 చెల్లించాల్సి ఉంది. అలాగే ఈ నెల 18 వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా చెల్లించేందుకు అవకాశం ఇచ్చారు. అయితే రూ.50 ఆలస్య రుసుంతో ఈ నెల 25 వరకు, రూ.200తో డిసెంబర్ 3 వరకు, రూ.500తో డిసెంబర్ 10వ తేదీ వరకు చెల్లించవచ్చు. అయితే పలు ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలలు రూ.500 నుంచి రూ.1500 దాకా వసూలు చేస్తున్నట్లు తల్లిదండ్రులు పేర్కొన్నారు. ఇదేమిటని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తే పరీక్షల సమయంలో పిల్లలను పరీక్షా కేంద్రాల వద్ద వదలడం, స్నాక్స్, ఇతర పరీక్షల నిర్వాహణ ఖర్చులు ఉంటాయని తల్లిదండ్రులకు చెబుతున్నారు. అధిక పరీక్ష ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంఈఓ సావిత్రమ్మను ఫోన్‌లో సంప్రదించగా ఆమె ఫోన్ లిఫ్ట్ చేయలేదు.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం



నిబంధన మేరకే 10 వ తరగతి పరీక్ష ఫీజు వసూలు చేయాలి. అధిక ఫీజు వసూలు చేసే పాఠశాలలపై చర్యలు తీసుకుంటాం. విద్యార్థుల తల్లిదండ్రులు తమ దృష్టికి తీసుకువస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆ విద్యాసంస్థలపై చర్యలు తీసుకుంటాము.

– సావిత్రమ్మ, ఎంఈఓ, ప్రొద్దుటూరు

ఇష్టానుసారంగా వసూలు చేస్తున్నారు

10వ తరగతి పరీక్ష ఫీజును ప్రైవేటు, కార్పొరేటు విద్యాసంస్థలు ఇష్టానుసారంగా వసూలు చేస్తున్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా అధిక మొత్తంలో వసూలు చేస్తున్న విద్యాశాఖ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దారుణం.

– వలరాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి

ఉత్కంఠగా బండలాగుడు పోటీలు

ఖాజీపేట : కార్తీకమాసం మూడవ సోమవారం పురస్కరించుకుని నాగనాథేశ్వర ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ పోటీల్లో 20 జతల ఎద్దులు పాల్గొన్నాయి. రాత్రి 8 గంటల వరకూ ఈ పోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి. మొదటి బహుమతి రూ. 50 వేలును అలంఖాన్ పల్లెకు చెందిన రెడ్డిచర్ల వెంకటరామిరెడ్డి, రెండవ బహుమతిని చెన్నూరు మండలం మేడా వంశీధర్‌రెడ్డి, ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన చంటన్న ఎద్దులు గెలుచుకున్నాయి. రెండవ బహుమతిని ఇద్దరు యజమానులకు సరి సగం అందజేశారు. మూడవ బహుమతి రూ. 30 వేలు అనంతపురం జిల్లా అక్కంపల్లె గ్రామానికి చెందిన కోసపల్లి ఇంద్రారెడ్డి, కడప రూరల్‌కు చెందిన రుకవారిపల్లె గ్రామానికి చెందిన బొజ్జ విద్యా ఓబుల్‌రెడ్డి, నాలుగో బహుమతి రూ. 20 వేలు కై వసం చేసుకున్నారు. మైదుకూరు గ్రామం పోతిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన మూలె లక్ష్మిరెడ్డి, ఐదవ బహుమతి రూ. 10 వేలు దక్కించుకున్నారు. అలాగే ప్రొద్దుటూరుకు చెందిన సాయి భరత్‌రెడ్డి, ఆరవ బహుమతి రూ. 5వేలు, పెండ్లిమర్రి మండలం తిప్పిరెడ్డిపల్లెకు చెందిన వడ్డెమాను విశ్వనాథరెడ్డి, చెన్నూరు మండలం ఓబులవారిపల్లెకు చెందిన సానపరెడ్డి సతీష్‌రెడ్డి ఎద్దులు గెలుపొందాయి. బండలాగుడు పోటీలను చూసేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. గెలిచిన ఎద్దుల యజమానులకు ఆలయ కమిటీ సభ్యులు బహుమతి ప్రదానం చేశారు. రసవత్తరంగా సాగిన ఈ పోటీలకు భారీగా బెట్టింగ్‌లు పెట్టారు.



బండలాగుడు పోటీలను తిలకిస్తున్న ప్రజలు

ఉత్సాహంగా వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు



ప్రొద్దుటూరు : చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థులు



అట్లూరు: వ్యాస రచన పోటీలో విద్యార్థులు

ప్రొద్దుటూరు : మండలంలోని గోపవరం గ్రామ పంచాయతీ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న గ్రంథాలయంలో సోమవారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి ఎస్.భాస్కర్ గ్రంథాలయ ఆవశ్యకత గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పి.రాజగోపాల్‌రెడ్డి, రిటైర్డ్ ఎంపీడీఓ ఎ.జగదీశ్వరరెడ్డి పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి

ప్రొద్దుటూరు : విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు గోపీనాథరెడ్డి తెలిపారు. స్థానిక పుట్టపర్తి నారాయణాచార్యులు ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో సోమవారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్తీ ఆహారంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గ్రంథాలయ అధికారిణి తిరుపతమ్మ మాట్లాడుతూ గ్రంథాలయాల్లో విద్యార్థులు సభ్యత్వం పొంది పుస్తకాలను ఇంటికి తీసుకెళ్లి చదువుకోవచ్చని తెలిపారు. జేవీవీ కన్వీనర్ చంద్రశేఖర్ రావు మూఢనమ్మకాల గురించి పాటల రూపంలో విద్యార్థులకు వివరించారు.

వ్యాసరచన పోటీలు

అట్లూరు: జాతీయ గ్రంథాలయాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం విద్యార్థులకు వ్యాస రచన వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయాధికారి ఎం.సుధాకర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అశ్వద్ధామరెడ్డి తెలిపారు. ఈ పోటీల్లో 3,4,5 తరగతుల విద్యార్థులకు చిత్రలేఖనం, 6,7,8 తరగతుల వారికి వ్యాసరచన పోటీలు, 9,10 తరగతుల విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కస్తూర్బాగాంధీ పాఠశాల విద్యార్థులు, అట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు.

పుస్తక పఠనం అలవరుచుకోవాలి

రాజుపాళెం : విద్యార్థులంతా పుస్తక పఠనాన్ని అలవరుచుకోవాలని రాజుపాళెం జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం వేలంగ్ కుమార్ అన్నారు. 57 జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా రాజుపాళెంలోని జెడ్పీ హైస్కూల్ ఆవరణంలో సోమవారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పీడీ సుబ్బయ్య, ఉపాధ్యాయులు రసీద్ ఖాన్, వెంకట రమణారెడ్డి పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు కల్చరల్ : రామేశ్వరంలోని బాలబాలికల గ్రంథాలయంలో సోమవారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా రచయితలు జింకా సుబ్రహ్మణ్యం, రాజశేఖరరాజు, వెంకటేష్‌ను సన్మానించారు. విశ్రాంత వైమానిక దళాధికారి వెంకట కొండయ్య, రవిబాబు, శ్రీనివాసులరెడ్డి, రికార్డు అసిస్టెంట్ ఇబ్రాం సాహెబ్ పాల్గొన్నారు.

చాపాడులో..

చాపాడు: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల పురస్కరించుకుని మండల కేంద్రమైన చాపాడులోని శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో ఉర్దూ హైస్కూల్‌లో సోమవారం గ్రంథాలయ ఆవశ్యకతపై విద్యార్థులు వ్యాస రచన పోటీలు నిర్వహించామని, ఈ పోటీల్లో 6 నుంచి 10వ తరగతికి చెందిన 72 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు గ్రంథాలయ అధికారి జే.శివశంకర్‌రెడ్డి తెలిపారు.

అర్హులైన పేదలందరికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

ప్రొద్దుటూరు : సీఎం చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పట్టణంలో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు ఇంటి స్థలం అర్హులైన పేదలందరికి ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య, ఏరియా కార్యదర్శి పి.సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఆరు నెలలవుతాన్నా ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ఇచ్చిన హామీపై ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. దీనిపై సీపీఐ రాష్ట్ర వ్యాప్తంగా సచివాయాలయాల వద్ద ధర్నాలు చేపట్టిందన్నారు. ప్రొద్దుటూరు పట్టణంలో కొన్ని ప్రాంతాల ప్రజల నుంచి ఇళ్ల స్థలాల కోసం స్వీకరించిన అర్జీలను అధికారులకు అందించామన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన సెంటు స్థలాన్ని మార్చి పట్టణ ప్రాంత పేదలకు 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల పేదలకు 3 సెంట్లు ఇస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఐ సమితి సభ్యులు వై.హరి, ప్రమీల, సుజాత, యేసోబ్, ఏఐఎస్ఎఫ్ పట్టణ కార్యదర్శి పీటర్, సహాయ కార్యదర్శి నాని పాల్గొన్నారు.

మైదుకూరు : పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆ మేరకు తహసీల్దార్ రాజసింహ నరేంద్రకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శ్రీరాములు, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతిరెడ్డి భాస్కర్ మాట్లాడుతూ పేదలకు పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు ఇంటి స్థలం, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలని, భూమి లేని నిరుపేదలకు ఒక హెక్టార్ భూమిని ఇవ్వాలని కోరారు. ధర్నాలో సీపీఐ, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల: అర్హులైన ప్రతి ఒక్కరికీ మూడు ఎకరాల భూమి, మూడు సెంట్ల ఇంటిస్థలం ఇవ్వాలని సీపీఐ ఏరియా కార్యదర్శి పిడుగు మస్తాన్, మండల కార్యదర్శి రవికుమార్ డిమాండ్ చేశారు. సోమవారం పోరుమామిళ్ల, రంగసముద్రం పంచాయతీల పరిధిలోని 7 సచివాలయాల్లో 318 దరఖాస్తులతో పాటు వినతిపత్రాలు అందజేశారు.

బద్వేలు అర్బన్ : ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం పేదలకు ఇచ్చిన హామీ ప్రకారం ఇళ్ళులేని నిరుపేదలకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు స్థలంతో పాటు వ్యవసాయ భూమిని ఇచ్చి హామీని నిలబెట్టుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరశేఖర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ, బీకేఎంయూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం మండల పరిధిలోని బయనపల్లె సచివాలయం వద్ద అర్హులైన లబ్ధిదారులతో కలిసి ధర్నా నిర్వహించారు.

ఆక్రమణలు తొలగించండి

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీ పరిధిలో ఆక్రమణలు తొలగించాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎ.సుధాకర్ మాదిగ సోమవారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునకు వినతి పత్రం అందజేశారు. 14 ఏళ్ల క్రితం తాను నిర్మించిన పెద్దమ్మ గుడిని కోర్టు ఆదేశాల పేరుతో తొలగించారని, మున్సిపాలిటీలో ఆక్రమించిన మిగతా నిర్మాణాలు మున్సిపల్ అధికారులకు కనిపించలేదా అని ప్రశ్నించారు. దళితుడనే కారణంతోనే తాను నిర్మించిన పెద్దమ్మ గుడి సముదాయాలను తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆధార్ క్యాంపును సద్వినియోగం చేసుకోండి

రాజుపాళెం : మండలంలోని అర్కటవేముల, చిన్నశెట్టిపల్లె గ్రామ సచివాలయాల్లో నిర్వహించే ప్రత్యేక మొబైల్ ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రమణారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్కటవేములలో 19 నుంచి 21వ తేదీ వరకు, 22 నుంచి చిన్నశెట్టి పల్లె గ్రామాల్లో నిర్వహిస్తున్నామన్నారు. పిల్లలకు ఆధార్ కార్డు అప్డేట్, చిరునామా, ఫోన్ నంబరు మార్పు, వేలిముద్రలు అప్డేట్ చేస్తారని తెలిపారు.

చాపాడు: మండల పరిధిలోని నాలుగు గ్రామ సచివాలయాల్లో మంగళవారం నుంచి 22వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారి వీర కిషోర్ తెలిపారు. 19న అయ్యవారిపల్లె, 20న చిన్నగురువళూరు, 21న చియ్యపాడు, 22న చాపాడులోని గ్రామ సచివాలయాల్లో క్యాంపులు నిర్వహిస్తామని తెలిపారు.

హర హర శంకర.. జయ జయ శంకర



రాజుపాళెం: వెల్లాలలో ప్రత్యేక అలంకరణలో భీమలింగేశ్వర స్వామి



ఖాజీపేట: నాగనాథీశ్వరునికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



ప్రొద్దుటూరు కల్చరల్ : పత్యేక అలంకరణలో సైకత లింగం



ప్రొద్దుటూరు కల్చరల్ : అగస్త్యేశ్వరాలయంలో ప్రత్యేక అలంకారంలో స్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : పరమశివునికి ప్రీతికరమైన కార్తీక మాసం మూడవ సోమవారాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పలు శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక అగస్త్యేశ్వరాలయంలో అగస్త్యమహాముని ప్రతిష్టించిన శివలింగానికి రుద్రాభిషేకాలు, రాజరాజేశ్వరి అమ్మవారికి కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో భక్తులు కార్తీక దీపాలను వెలిగించారు. ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈఓ రామచంద్రాచార్యులు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్థానిక రామేశ్వరంలోని ముక్తి రామలింగేశ్వరాలయంలో శ్రీరాముడు ప్రతిష్టించిన సైకత లింగానికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి, ఆది శంకరాచార్యులు ప్రతిష్టించిన శ్రీచక్రానికి విశేష అభిషేకాలు చేసి అమ్మవారి మూలవిరాట్‌ను నిమ్మకాయలతో, స్వామివారి ఉత్సవ మూర్తిని అఘోర ఈశ్వరునిగా అలంకరించారు. హనుమత్ లింగేశ్వరస్వామి ఆలయంలో స్వామికి భక్తులు స్వయంగా అభిషేకాలు చేశారు.

గురప్పస్వామి క్షేత్రంలో..

పోరుమామిళ్ల: మండలంలోని శ్రీ మద్దిమాను గురప్పస్వామి ఆలయ ఆవరణ కార్తికమాసం మూడవ సోమవారం సందర్భంగా ఆలయంలో కార్తీక దీపాలు వెలిగించారు. మహిళలు తెల్లవారు జాము నుంచే ఆలయానికి భారీ సంఖ్యలో చేరుకున్నారు. అర్చకులు వేణుమాధవ శర్మ వేకువ జామునే స్వామికి అభిషేకం చేసి గురప్పస్వామిని అలంకరించారు. భక్తులు స్వామిని దర్శించుకొని కార్తీకదీపాలు వెలిగించి కాయకర్పూరం సమర్పించారు.

ఆత్మారామస్వామి ఆలయంలో..

మండలంలోని చల్లగిరిగెల శ్రీ ఆత్మారామస్వామి దేవస్థానంలో కార్తీక మూడవ సోమవారాన్ని పురస్కరించుకొని ఉత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం మహిళలు కార్తీకదీపాలు వెలిగించారు. సాయంత్రం 111 ప్రమిదలు వెలిగించి, ఆకాశదీపం పెట్టారు.

శంభో శంకర

ఖాజీపేట : హరహర శంభో శంకర అన్న భక్తుల నినాదంతో నాగనాథీశ్వర కోన పులకించిపోయింది. కార్తీకమాసం మూడవ సోమవారం రోజున పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఆలయంలోని ధ్వజస్తంభం వద్ద కార్తీక దీపాలు వెలిగించి కొండకు కార్తీక శోభ తెచ్చారు.

ప్రత్యేక పూజలు చేసిన మాజీ మంత్రి

మూడవ సోమవారం పురస్కరించుకుని నాగనాథేశ్వర స్వామిని మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శివాలయాల్లో భక్తుల పూజలు

రాజుపాళెం : కార్తీక మాసంలో మూడవ సోమవారం కావడంతో శివాలయాల్లో భక్తుల సందడి నెలకొంది. తెల్లవారుజామున మూడు గంటలకే ఆలయాల్లో, కాలువల్లో, కుందూనది వద్ద మహిళలు కార్తిక దీపాలు వెలిగించి పూజలు చేశారు. వెల్లాలలోని శ్రీభీమలింగేశ్వర స్వామి ఆలయం, మిగతా గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి పూజలు, అభిషేకాలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆయా గ్రామల్లోని భక్తులు మహానంది, యాగంటి, శ్రీశైలం, ఓంకారం తదితర పుణ్యక్షేత్రాలకు తరలివెళ్లారు. రాజుపాళెంలోని శివాలయంలో దాతలు, భక్తుల సహకారంతో అక్కడకు వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

శివనామ స్మరణలతో ..

చాపాడు: మండలంలోని అల్లాడుపల్లె శ్రీవీరభద్రస్వామి ఆలయానికి కార్తిక మాసం మూడవ సోమవారం సందర్భంగా భక్తులు పోటెత్తింది. సోమవారం తెల్లవారుజాము నుంచే వీరభద్రస్వామి, భద్రకాళీమాత, కేథారీశ్వరుడులు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమివ్వగా వేలాది మంది భక్తులు దర్శించుకునేందుకు బారులు తీరారు. ఆలయ ప్రాంగణంలో స్వామివారిని ఊరేగించారు. భక్తులందరికీ అన్న సత్రాలలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు ఈఓ మారుతి ప్రసాద్ తెలిపారు.

వైభవం .. శివపార్వతుల కల్యాణం

బద్వేలు అర్బన్ : పట్టణంలోని రూపరాంపేట శివానందస్వామి శివాలయంలో మూడవ కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని నిర్వహించిన శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ నిర్వహించిన కల్యాణ ఉత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పోటెత్తారు. ముందుగా శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ఆలయం నుంచి ఊరేగింపుగా మేళతాళాలతో కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, దేవాదాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

శివనామస్మరణతో మారుమోగిన శివాలయాలు


బి.కోడూరు : కార్తీక మాసం మూడవ సోమవారం పురస్కరించుకుని మండలంలోని శివాలయాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. మేకవారిపల్లె గ్రామ సమీపాన గల శ్రీఅఖిలాండేశ్వరి బ్రహ్మనంద ఆశ్రమంలో ఉన్న 108 శివలింగాలను దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుండే మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఆలయంలో దీపాలను వెలిగించి పూజలు నిర్వహించారు. ఆశ్రమంలోని 108 శివలింగాలను, నందీశ్వరుని, అష్టాదశ శివలింగం, పంచముఖ ఆంజనేయస్వామి, దత్తాత్రేయ, సత్యనారాయణస్వామిలను ఆలయ నిర్వాహకులు పూలతో ప్రత్యేక అలంకరణ చేశారు.



బద్వేలు అర్బన్ : శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు కల్యాణం



పోరుమామిళ్ల: గురప్పస్వామి ఆలయ ప్రాంగణంలో..



చాపాడు: భద్రకాళీ సమేత వీరభద్రస్వామిని ఊరేగిస్తున్న భక్తులు